

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



నవంబర్ 15 ఆదివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 279 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SUNDAY NOVEMBER 15 2026 | VOL:18 | ISSUE: 279 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

తెలంగాణ గిగ్ వర్కర్లకు గుడ్‌న్యూస్..

రూ.5 లక్షల బీమా, రూ.10 లక్షల వైద్యం

సంక్షేమ పథకాన్ని రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి కలిసి ప్రారంభం

ఈ పథకం కింద రూ.5 లక్షల జీవిత బీమా

రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం

హైదరాబాద్‌లో జరిగిన సభకు ముందు గిగ్ వర్కర్ల భారీ బైక్ ర్యాలీ

అనంతరం గిగ్ వర్కర్లతో రాహుల్ ముఖాముఖి



సామాజిక భద్రత, సంక్షేమ పథకం' విధివిధానాలను ఆయన ప్రారంభించారు.

తెలంగాణలో గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. వారికి రూ.5 లక్షల జీవిత బీమాతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం అందించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని జయభేరీ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన సభలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి 'తెలంగాణ గిగ్ వర్కర్ల

గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు

(మిగతా 2వ పేజీలో..)

హైదరాబాద్‌లో రాహుల్ గాంధీ.. గిగ్ వర్కర్ల సంక్షేమ పథకానికి శ్రీకారం

హైదరాబాద్‌లో గిగ్ వర్కర్ల సంక్షేమ పథకాన్ని ప్రారంభించనున్న రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గిగ్ వర్కర్ల చట్టం-2026 అమలులో ఇది కీలక ముందడుగు

యాప్ ఆధారిత సంస్థల్లో పనిచేసే కార్మికులకు సామాజిక భద్రత, సంక్షేమ ప్రయోజనాలు

ఈ పథకం కింద కార్మికుల రిజిస్ట్రేషన్, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు

ఫిర్యాదుల పరిష్కారం కోసం యంత్రాంగం

నేడు శిల్పారామం నుంచి జయభేరి గ్రౌండ్స్ వరకు భారీ ర్యాలీ

తెలంగాణలోని యాప్ ఆధారిత సంస్థల్లో పనిచేస్తున్న

(మిగతా 2వ పేజీలో..)



గిగ్ వర్కర్ల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా









- రాహుల్ గాంధీ చేతుల మీదుగా సామాజిక భద్రత, సంక్షేమ పథకం ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 14 (విజయ కెరటం):

గిగ్ వర్కర్ల ఆత్మగౌరవం, సంక్షేమం, సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక హామీని నెరవేర్చిందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో వేలాది మంది గిగ్ వర్కర్ల సమక్షంలో తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకాన్ని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శనివారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరుల సమక్షంలో రాహుల్ గాంధీ ఈ పథకాన్ని ప్రారంభించడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు వారి సంక్షేమానికి భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గిగ్ వర్కర్లకు గౌరవప్రదమైన భవిష్యత్తును అందించే దిశగా ఈ పథకం కీలక ముందడుగు అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

రాహుల్ గాంధీ హామీలన్నీ గాలి మాటలే: బండి సంజయ్

గిగ్ వర్కర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తామనడం పెద్ద జోక్ అంటూ బండి సంజయ్ ఎద్దేవా

కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలు గాలి మూటలుగా మిగిలిపోయాయని విమర్శ

గతంలో ఇచ్చిన వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్ల అమలు ఏమైందో ప్రజలకు చెప్పాలని డిమాండ్

హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించిన గిగ్ వర్కర్ల సంక్షేమ పథకంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ నోట పలికేవన్నీ గాలి మాటలేనని ఆయన విమర్శించారు. గిగ్ వర్కర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తామని రాహుల్ గాంధీ చెప్పడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, కాంగ్రెస్ పార్టీ తీరుపై నిప్పులు చెరిగారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు ఇప్పటివరకు గాలి మూటలుగానే మిగిలిపోయిన మాట వాస్తవం కాదా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్

(మిగతా 2వ పేజీలో..)



తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి: కేటీఆర్

హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని నిలదీసిన కేటీఆర్

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అబద్ధాల పుట్ట అంటూ ఎక్స్ వేదికగా ధ్వజం

420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై సూటి ప్రశ్నలు

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో రాష్ట్ర ప్రజలకు రాహుల్ గాంధీ వెంటనే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'అభయ హస్తం' పచ్చి అబద్ధాల పుట్ట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో హైదరాబాద్‌లో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ... కాంగ్రెస్ ఇచ్చిన

(మిగతా 2వ పేజీలో..)



గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం.. ప్రతి డెలివరీపై 1 శాతం నగదు జమ: రాహుల్ గాంధీ

తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరించిన రాహుల్ గాంధీ

ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడి

రూ.5 లక్షల ప్రమాద బీమా, పింఛన్, సామాజిక భద్రత కల్పిస్తామని హామీ

పని, ఆదాయ వివరాలు మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉంటాయని వెల్లడి

వైఫైతో ప్రత్యేక విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేస్తామని హామీ

గిగ్ వర్కర్ల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కేలా, వారి హక్కులు, సంక్షేమానికి భరోసా కల్పించడమే కాంగ్రెస్ పార్టీ



లక్ష్యమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా కొత్త విధానాన్ని తీసుకొచ్చామని వెల్లడించారు.

(మిగతా 2వ పేజీలో..)

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు హౌస్ అరెస్ట్

భారత్ సమ్మిట్‌ను అడ్డుకుంటామని హెచ్చరించడంతో పోలీసుల ముందస్తు చర్యలు

దేశ ప్రతిష్టను దిగజార్చేలా సదస్సు నిర్వహిస్తున్నారన్న రాంచందర్‌రావు

రాష్ట్రవ్యాప్తంగా నల్లజెండాలతో నిరసనలకు పిలుపునిచ్చిన బీజేపీ శ్రేణులు



హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా జరుగుతున్న 'భారత్ సమ్మిట్'

(మిగతా 2వ పేజీలో..)

విజయకేరళం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం

జనసంద్రోహంలో ఒంటరి మనిషి..
మాయమవ్వుతున్న మానవ సంబంధాలు!

మనిషి చుట్టూ వేలమంది ఉన్నా మనసులో ఒంటరితనం పెరుగుతున్న విచిత్రమైన పరిస్థితి నేటి సమాజంలో కనిపిస్తోంది. అపార్ట్‌మెంట్లలో వందల కుటుంబాలు నివసిస్తున్నా పక్కింటి వారి పేర్లు కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయి. ఒకే ఇంట్లో కుటుంబ సభ్యులందరూ ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ప్రపంచంలో మునిగిపోతున్నారు. ఒకప్పుడు సాయంత్రం వేళ వీధుల్లో పిల్లల ఆటలు, పెద్దల పలకరింపులు, కుటుంబ సభ్యుల సంభాషణలతో సందడి కనిపించేది. ఇప్పుడు ఆ స్థానాన్ని మొబైల్ తెరలు, టెలివిజన్లు, సామాజిక మాధ్యమాలు ఆక్రమిస్తున్నాయి. ఆధునిక జీవితం సౌకర్యాలను పెంచినా.. మనుషుల మధ్య ఆత్మీయతను అదే స్థాయిలో పెంచలేకపోతోందనే వాస్తవాన్ని విస్మరించలేం.

పలకరింపులు కరువవుతున్నాయా?

ఒకప్పుడు గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ పక్కింటి వారి కష్టసుఖాల్లో అందరూ భాగస్వాములయ్యేవారు. ఎవరి ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా, అనారోగ్యం ఎదురైనా చుట్టుపక్కల వారు ముందుకొచ్చేవారు. ఆత్మీయతకు రక్తసంబంధమే అవసరం లేదని నిరూపించే అనుబంధాలు ఉండేవి. ఇప్పుడు సమయాభావం, ఉద్యోగ ఒత్తిడి, వ్యక్తిగత జీవితానికి పరిమితమైన ఆలోచనా విధానం కారణంగా పరిచయాలు తగ్గుతున్నాయి. పలకరించడానికి కూడా సమయం కేటాయించలేని స్థితి ఏర్పడుతోంది.పొరుగువారితో కనీస పరిచయం లేకపోవడం అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులకు దారితీయవచ్చు. సామాజిక సంబంధాలు కేవలం స్నేహానికే కాదు.. పరస్పర సహకారం, భద్రత, మానసిక ప్రశాంతతకు కూడా అవసరం.

సోషల్ మీడియాలో వేల మంది.. జీవితంలో తోడు ఎంతమంది?

సామాజిక మాధ్యమాల్లో వందలాది మంది స్నేహితులు, అనుచరులు ఉన్నప్పటికీ నిజ జీవితంలో మనసులోని మాట చెప్పుకునే వ్యక్తి లేకపోవడం చాలామందిలో కనిపిస్తున్న సమస్య. ఇతరుల సంతోషాలు, విజయాలు, విహారయాత్రలు చూస్తూ తమ జీవితాన్ని వారితో పోల్చుకోవడం వల్ల కొందరిలో అసంతృప్తి పెరుగుతోంది.ఆన్‌లైన్‌లో పలకరింపులు, స్పందనలు ఉన్నంత మాత్రాన నిజమైన అనుబంధం ఏర్పడినట్లు కాదు. కష్టసమయంలో పక్కన నిలిచే వ్యక్తి, బాధను ఓపికగా వినే స్నేహితుడు, మనసుకు ధైర్యం చెప్పే కుటుంబ సభ్యుడు ఉండటం ఎంతో ముఖ్యం. సాంకేతికతను సంబంధాలు పెంచుకునేందుకు ఉపయోగించుకోవాలి తప్ప.. ప్రత్యక్ష అనుబంధాలకు దూరమయ్యే సాధనంగా మార్చుకోకూడదు.

వృద్ధుల్లో ఒంటరితనం.. కుటుంబాలకు హెచ్చరిక

ఉద్యోగాలు, విద్య, ఇతర అవకాశాల కోసం పిల్లలు విదేశాలకు, ఇతర నగరాలకు వెళ్తున్నారు. దీంతో వృద్ధ తల్లిదండ్రులు స్వస్థలాల్లో ఒంటరిగా జీవించాల్సి వస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు లేకపోయినా మాట్లాడేందుకు మనుషులు లేక కొందరు మానసిక వేదనకు గురవుతున్నారు. అనారోగ్య సమయంలో సహాయం అందకపోవడం మరో సమస్య.వృద్ధులకు అవసరమయ్యేది కేవలం డబ్బు, మందులు మాత్రమే కాదు. కుటుంబ సభ్యుల ఆప్యాయత, గౌరవం, సమయం కూడా అవసరం. దూరంగా ఉన్న పిల్లలు ప్రతిరోజూ కొద్దిసేపైనా తల్లిదండ్రులతో మాట్లాడాలి. వారి ఆరోగ్యం, అవసరాలు తెలుసుకోవాలి. సాధ్యమైనప్పుడల్లా కలిసి సమయం గడపాలి. వృద్ధాప్యాన్ని ఒంటరితనంగా మార్చకుండా చూడటం ప్రతి కుటుంబ బాధ్యత.

పిల్లల బాల్యాన్ని మొబైల్ ఆక్రమించకూడదు

నేటి బాల్యంలో ఆటస్థలాల కంటే మొబైల్ తెరలకే ఎక్కువ స్థానం లభిస్తోంది. స్నేహితులతో కలిసి ఆడుకోవడం, కథలు వినడం, ప్రకృతిని ఆస్వాదించడం వంటి అనుభవాలు తగ్గుతున్నాయి. తల్లిదండ్రులు పని ఒత్తిడితో పిల్లలకు మొబైల్ ఇచ్చి నిశ్శబ్దంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. ఇది తాత్కాలికంగా సౌకర్యంగా అనిపించినా దీర్ఘకాలంలో పిల్లల సామాజిక నైపుణ్యాలు, ప్రత్యక్ష సంభాషణ అలవాట్లపై ప్రభావం చూపవచ్చు.పిల్లలకు ఆటలు, పుస్తక పఠనం, కుటుంబ విహారాలు, స్నేహితులతో కలిసి గడిపే సమయం అందించాలి. వారితో తల్లిదండ్రులు మాట్లాడాలి. వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. పిల్లలు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే వాతావరణం ఇంట్లో ఉండాలి.

ఒంటరితనాన్ని గుర్తించడం సమాజ బాధ్యత

ఒంటరితనం ప్రతి ఒక్కరిలో ఒకే విధంగా కనిపించదు. కొందరు తమ బాధను బయటపెట్టరు. మరికొందరు జనంతో కలిసే ఉన్నప్పటికీ అంతర్గతంగా ఒంటరితనాన్ని అనుభవిస్తారు. అందువల్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు ఒకరి ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి. బాధలో ఉన్నవారిని విమర్శించకుండా వారి మాట వినాలి. అవసరమైతే మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం తీసుకునేలా ప్రోత్సహించాలి. స్థానిక సంస్థలు, అపార్ట్‌మెంట్ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సామూహిక సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించవచ్చు. వృద్ధులు, పిల్లలు, యువత అందరూ పాల్గొనే వేదికలు ఏర్పాటుచేస్తే సామాజిక అనుబంధాలు బలపడతాయి.

మళ్లీ మనుషులతో మనం కలవాలి

మారుతున్న జీవనశైలిని పూర్తిగా వెనక్కి తీసుకెళ్లడం సాధ్యం కాదు. సాంకేతికతను వదిలేయాల్సిన అవసరమూ లేదు. కానీ దానికి మన జీవితాన్ని పూర్తిగా అప్పగించకూడదు. రోజులో కొంత సమయాన్ని మొబైల్‌కు దూరంగా కుటుంబ సభ్యులతో గడపాలి. పాత స్నేహితులను కలవాలి. పొరుగువారిని పలకరించాలి. పిల్లలతో ఆడుకోవాలి. వృద్ధుల అనుభవాలను వినాలి. మనిషికి సౌకర్యాలు అవసరం.. కానీ వాటికంటే ఎక్కువగా ఆప్యాయత అవసరం. వేల మంది పరిచయాలు ఉన్నా కష్టసమయంలో తోడు లేకపోతే ఆ పరిచయాలకు అర్థం ఉండదు. ఆధునికతను స్వీకరిస్తూనే మానవ సంబంధాలను కాపాడుకోవాలి. ఒక పలకరింపు, ఒక ఆత్మీయమైన మాట, ఒక చిన్న సహాయం మరొకరి జీవితంలో ఎంతో మార్పు తీసుకురాగలవు. జనసందోహంలో ఒంటరిగా మిగిలిపోకుండా.. మనుషులతో మనం మళ్లీ కలవాలి. సంబంధాలను కాపాడుకోవడమే నిజమైన సంపద!

తెలంగాణ గిగ్ వర్కర్లకు గుడ్‌న్యూస్..
రూ.5 లక్షల బీమా, రూ.10 లక్షల వైద్యం

మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గిగ్ వర్కర్లు కష్టానికి తగిన ఆదాయం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రాహుల్ గాంధీని కలిసిన గిగ్ వర్కర్లు తమకు చట్టపరమైన రక్షణ, గుర్తింపు లేదని సమస్యలు వివరించారని గుర్తుచేశారు. వారికి న్యాయం చేస్తామని అప్పట్లో రాహుల్ హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు.వివిధ రంగాలకు చెందిన పలువురి అభిప్రాయాలు, సలహాలు తీసుకున్న తర్వాతే ఈ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే కాంగ్రెస్ పార్టీ విధానమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న రాహుల్, రేవంత్

సభకు ముందు శిల్పకళా వేదిక నుంచి జయభేరి గ్రౌండ్స్ వరకు గిగ్ వర్కర్లు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జయభేరి గ్రౌండ్స్‌లో రాహుల్ గాంధీ గిగ్ వర్కర్లతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలు, డిమాండ్లను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

హైదరాబాద్‌లో రాహుల్ గాంధీ.. గిగ్ వర్కర్ల సంక్షేమ పథకానికి శ్రీకారం

మొదటి పేజీ తరువాయి)

లక్షలాది మంది గిగ్ వర్కర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు 'తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకాన్ని' ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో జరగనున్న ఈ కార్యక్రమం, గిగ్ ఆర్థిక వ్యవస్థలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంలో ఒక కీలక ముందడుగుగా నిలవనుంది.ఈ కార్యక్రమం కోసం రాహుల్ గాంధీ నిన్న రాత్రే హైదరాబాద్ చేరుకున్నారు. ఈరోజు ఉదయం 11 గంటలకు జయభేరి గ్రౌండ్స్‌లో జరిగే సభలో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి రాహుల్ గాంధీ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. కార్యక్రమానికి ముందు, హైటెక్ సిటీలోని శిల్పారామం వద్ద అంతర్జాతీయ ప్రతినిధులతో సమావేశమై, అక్కడి నుంచి జయభేరి గ్రౌండ్స్ వరకు భారీ ర్యాలీలో పాల్గొంటారు.ఈ ఏడాది ఆరంభంలో తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన 'తెలంగాణ ప్లాట్‌ఫామ్-బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్-2026'ను అమలు చేయడంలో ఈ పథకం ప్రారంభం ఒక మైలురాయి. ఈ చట్టం ప్రకారం గిగ్ వర్కర్లకు ప్రత్యేక గుర్తింపు, వారి సంక్షేమం కోసం ఒక ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, సామాజిక భద్రతా చర్యలు, సమస్యల పరిష్కారానికి ఒక ప్రత్యేక యంత్రాంగం అందుబాటులోకి వస్తాయి.ప్రస్తుతం ఈ పథకం అమలుకు అవసరమైన నిబంధనలను నోటిఫై చేయడంతో పాటు వెల్ఫేర్ బోర్డును కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ అధికారులు తెలిపారు. యాప్ ఆధారిత డెలివరీ, రవాణా వంటి రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత, సంక్షేమ ఫలాలు అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ చారిత్రక కార్యక్రమం, భారత్ సమ్మిట్ ముగింపు సెషన్ జరుగుతున్న సమయంలోనే జరగడం గమనార్హం.

తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీలపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రూ. 1 లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి, మూడేళ్లలో రూ. 5,000 కోట్లు కూడా కేటాయించలేదని కేటీఆర్ ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని కూడా గాలికి వదిలేశారని మండిపడ్డారు.అలాగే ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి, కేవలం 10 వేల ఉద్యోగాలతో సరిపెట్టారని విమర్శించారు. విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డులు, పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షల చొప్పున ఇచ్చే అంబేద్కర్ అభయ హస్తం సాయం, మైనార్టీల నిధుల కేటాయింపుల్లోనూ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులు, రైతుల సమస్యలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ నిలదీశారు.

రాహుల్ గాంధీ హామీలన్నీ గాలి మాటలే: బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్‌ల అమలు ఏమైందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత హామీలను నెరవేర్చకుండా పక్కనపెట్టేసి, ఇప్పుడు కొత్తగా మరో హామీ ఇవ్వడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించారు.రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఆరోగ్యశ్రీ పథకానికి నిధులు సరిగ్గా కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఇచ్చిన హెల్త్ కార్డులు కూడా ఆసుపత్రులలో సరిగ్గా పనిచేయడం లేదని ఆయన గుర్తుచేశారు. ఉన్న పథకాలకే దిక్కులేకుండా చేసి, కొత్తగా గిగ్ వర్కర్లకు బీమా, ఆరోగ్య భద్రత కల్పిస్తామంటే ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరని సంజయ్ స్పష్టం చేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు హౌస్ అరెస్ట్

మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ సదస్సు ముగింపు సమావేశాలకు కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ హాజరవుతున్న క్రమంలో ఆయన పర్యటనను అడ్డుకుంటామని బీజేపీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు.ఈ ఉదయం తార్నాకలోని రాంచందర్‌రావు నివాసం వద్ద ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు భారీగా మోహరించారు. ఆయన ఇంటి నుంచి బయటకు రాకుండా గృహనిర్బంధంలో ఉంచారు. రాహుల్ గాంధీ పర్యటనను అడ్డుకోవడంతో పాటు సమ్మిట్‌కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు నల్లజెండాలతో నిరసనలు చేపట్టాలని రాంచందర్‌రావు పిలుపునివ్వడమే పోలీసుల చర్యకు కారణమైంది. తన గృహనిర్బంధంపై రాంచందర్‌రావు తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ తీరును తప్పుబట్టారు. "భారత్ సమ్మిట్ పేరుతో విదేశీయులను ఆహ్వానించి దేశ ప్రతిష్టను, ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని కించపరిచే ప్రయత్నం చేస్తున్నారు" అని ఆయన ఆరోపించారు. దేశ వ్యతిరేక శక్తులతో కలిసి ఈ సదస్సును నిర్వహిస్తున్నారని, రాహుల్ గాంధీని రీలాంచ్ చేసేందుకే దీనిని వేదికగా మార్చుకున్నారని ఆయన విమర్శించారు. మరోవైపు తమ పార్టీ అధ్యక్షుడి హౌస్ అరెస్ట్‌పై బీజేపీ వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించాయి. హెచ్‌ఐసీసీ పరిసరాల్లో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం.. ప్రతి డెలివరీపై 1 శాతం నగదు జమ: రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

కంపెనీలకే అనుకూలంగా కేంద్ర విధానాలు

గిగ్ వర్కర్లకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇప్పటివరకు అందుబాటులో లేదని, తమ శ్రమకు ఎంత ప్రతిఫలం వస్తోందనే విషయంలోనూ స్పష్టత లేదని రాహుల్ గాంధీ అన్నారు. గతంలో వారి సంక్షేమంపై జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీని ఇప్పుడు నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు కంపెనీలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయని విమర్శించారు. గిగ్ వర్కర్లను మోదీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ వెట్టిచాకిరీ కార్మికులుగా మార్చాలని చూస్తున్నాయని ఆరోపించారు. వారిని బానిసలుగా మార్చి దోపిడీ చేయాలనుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్మికులను సేవకులుగా కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

ఫోన్‌లోనే పని, ఆదాయ వివరాలు

గిగ్ వర్కర్లకు రక్షణ కల్పించడమే కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని రాహుల్ తెలిపారు. ప్రతి డెలివరీకి సంబంధించిన వివరాలు, చేసిన శ్రమ, దానికి లభించే ప్రతిఫలం నేరుగా వారి మొబైల్ ఫోన్లలోనే అందుబాటులో ఉంటాయని చెప్పారు. గిగ్ వర్కర్ల సౌకర్యార్థం వైఫై వసతితో ప్రత్యేక విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.ప్రమాదాలు, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు గిగ్ వర్కర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ గాంధీ అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కొత్త చట్టం ద్వారా రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. పింఛన్, సామాజిక భద్రత, పొదుపు కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని గిగ్ వర్కర్ల బోర్డు ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్మికుల హక్కులు, వారి కుటుంబాల విద్య, వైద్యం, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం.. వ్యక్తిత్వ వికాసం





- గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా అభివృద్ధి చేస్తాం
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 14 (విజయ కెరటం):

పుస్తక పఠనంతోనే విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు. షార్ట్‌కట్ చదువులకు స్వస్తి పలికి, పుస్తకాలను పూర్తిగా చదవడం ద్వారా విషయ పరిజ్ఞానంతో పాటు అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జిల్లాలోని గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవానికి నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సరస్వతీ దేవి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, విద్యార్థులు, యువత పుస్తక పఠనాన్ని నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని అన్నారు. పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానంతో పాటు ఆలోచనా శక్తి, విశ్లేషణ సామర్థ్యం, వ్యక్తిత్వ వికాసం పెరుగుతాయని పేర్కొన్నారు. డిజిటల్ పుస్తకాలు, ఆన్‌లైన్ గ్రంథాలయ సేవలను కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 కేటగిరీల్లో మొత్తం 23 గ్రంథాలయాలు ఉన్నాయని తెలిపారు. నేషనల్ డిజిటల్ లైబ్రరీ మిషన్ ద్వారా పాఠకులకు మరిన్ని పుస్తకాలు, విజ్ఞాన వనరులు అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు. గ్రంథాలయాల్లో పుస్తకాల సంఖ్య పెంచడంతో పాటు డిజిటల్ సదుపాయాలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు ప్రతిరోజూ భోజన సదుపాయం కల్పించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత ప్రతిరోజూ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవాలని పిలుపునిచ్చారు. సంప్రదాయ పుస్తకాలతో పాటు డిజిటల్ గ్రంథాలయ సేవలను వినియోగించుకుంటూ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మామిడి కార్తీక్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గాధ వినోద్ రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనా రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి బాలమ్మ, గ్రంథాలయ అధికారి ఎస్. వేణుగోపాలచార్యులు, ఆర్. కుసుమశ్రీ, రాజేష్, సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే వ్యవసాయం లాభసాటి





- రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి.. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 14 (విజయ కెరటం):

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నాణ్యమైన దిగుబడులు సాధించాలని, రైతులకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. శనివారం నల్గొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల వ్యవసాయ ప్రదర్శన (అగ్రి షో)ను నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన 120 స్టాళ్లను సందర్శించి ఆధునిక వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, నూతన సాగు పద్ధతులు, వివిధ వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, రానున్న రోజుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున తక్కువ నీటితో పండించే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిశీలించి పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సేంద్రియ వ్యవసాయంతో పాటు శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం రైతు భరోసా, సూక్ష్మ సేద్యం, నూనెగింజలు, ఆయిల్‌పామ్, కూరగాయలు, పప్పుధాన్యాల సాగుకు వివిధ పథకాల ద్వారా ప్రోత్సాహం, సబ్సిడీలు అందిస్తోందని వివరించారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 14 వేల ఎకరాల్లో నూనెగింజల పంటలు సాగు చేస్తున్నామని, మరింత మంది రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. రైతులు సంఘాలుగా ఏర్పడి సమష్టి సాగు చేపడితే అధిక లాభాలు పొందవచ్చన్నారు. పంటలను కేవలం ముడి ఉత్పత్తులుగా విక్రయించకుండా ప్రాసెసింగ్ ద్వారా విలువ జోడించి మార్కెట్‌లో విక్రయించాలని సూచించారు. రైతులు, మహిళా సంఘాలు చిన్న తరహా పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నల్గొండ పట్టణంలో వ్యవసాయ ప్రదర్శన నిర్వహించడం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతు పండిస్తేనే ప్రజలకు అన్నం దొరుకుతుందని పేర్కొన్నారు. రైతు దేశానికి వెన్నెముక అని, ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా పథకాలతో అండగా నిలుస్తోందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విష్ణు కృష్ణ, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నర్సింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుకు సీతారాములు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, మల్లు లక్ష్మి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, జూలకంటి రాజేందర్, ప్రమీల, స్థాళ్ల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

- నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.. ఈ-సాక్ష్య యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలి
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ, నవంబర్ 14 (విజయ కెరటం):



జిల్లాలో నేర నియంత్రణతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, నిందితులకు శిక్ష పడేలా పక్కా ఆధారాలు సేకరించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు నిర్దీత కాలపరిమితిలో దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. కేసుల దర్యాప్తులో పారదర్శకత, శాస్త్రీయ ఆధారాల సేకరణ కోసం ప్రతి దర్యాప్తు అధికారి ఈ-సాక్ష్య యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష్య వంటి సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. పాత నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, బీట్ పోలీసింగ్‌ను బలోపేతం చేసి నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పట్టణాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, ముఖ్యమైన రహదారుల్లో సీసీ కెమెరాల ఏర్పాటును విస్తరించాలని, ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇసుక అక్రమ మైనింగ్, పీడీఎస్ బియ్యం, నిత్యావసర వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించి, చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల ఛేదన, కేసుల దర్యాప్తు, కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెంపునకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీలు మల్లారెడ్డి, శివరాం రెడ్డి, శ్రీనివాస్ రావు, లక్ష్మీనారాయణ, సీఐలు, ఎస్ఐలు, సంబంధిత పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ప్రతి ఓటు.. ప్రజాస్వామ్య మార్పునకు పునాది!

- జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారానికి కార్యాచరణ.. ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి మద్దతు కోరుతాం
- ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, పార్టీ సమన్వయకర్త సయ్యద్ ఇస్మాయిల్



మహబూబాబాద్: నవంబర్ 14 విజయ కెరటం ప్రతినిధి



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు అత్యంత కీలకమని, ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు సమాజ అభ్యున్నతికి పట్టభద్రుల ఓటు పునాది కావాలని వరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, తెలంగాణ రక్షణ సేన పార్టీ సమన్వయకర్త సయ్యద్ ఇస్మాయిల్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలోని కళాశాలలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లను కలుపుతూ ప్రత్యేక రూట్‌మ్యాప్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. వైద్యులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పట్టభద్రులు, ఇతర విద్యావంతులను వ్యక్తిగతంగా కలిసి తమకు మద్దతు ఇవ్వాలని కోరనున్నట్లు పేర్కొన్నారు. ప్రచారాన్ని కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా ప్రతి ఓటరును నేరుగా కలిసి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటామని తెలిపారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం, విద్యావంతుల హక్కుల పరిరక్షణ, నిరుద్యోగ యువతకు భరోసా, విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ తమ ప్రచారాన్ని కొనసాగిస్తామని అన్నారు. ప్రతి పట్టభద్రుడి ఓటు సమాజ భవిష్యత్తును ప్రభావితం చేసే శక్తి కలిగి ఉంటుందని, ఓటు హక్కును బాధ్యతగా భావించి ఆలోచనాత్మకంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మూడు జిల్లాల కోఆర్డినేటర్ సయ్యద్ ఇస్మాయిల్, జిల్లా అధ్యక్షుడు గంధసిరి వేణు, పార్లమెంట్ అధ్యక్షుడు బోడ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బైరు సైదులు గౌడ్

- పదేళ్ల సేవలకు గుర్తింపుగా కీలక బాధ్యత..
- ప్రభుత్వ శాఖల్లో సమాచార హక్కు చట్టం సమర్థవంతమైన అమలుకు కృషి చేయాలి: కలెక్టర్ చంద్రశేఖర్
- ప్రజలకు, అధికారులకు వారధిగా ఉంటా: బైరు సైదులు గౌడ్

నల్గొండ, నవంబర్ 13 (విజయ కెరటం):



నల్గొండ జిల్లా ఆర్టీఐ (సమాచార హక్కు) మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నల్గొండ పట్టణానికి చెందిన బైరు సైదులు గౌడ్ నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నియామక ఉత్తర్వులు జారీ చేయగా, శుక్రవారం కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో సమాచార హక్కు చట్టం–2005 సమర్థవంతంగా అమలయ్యేలా కమిటీ సభ్యుడు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులకు చట్టంపై అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తు చేసుకునే పౌరులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు. బైరు సైదులు గౌడ్ మాట్లాడుతూ గత పదేళ్లుగా సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో జిల్లాలో ఆర్టీఐ చట్టం అమలు, ప్రజల్లో అవగాహన కల్పన కోసం చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యత అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, ఆర్డీఓ అశోక్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ అధికారులకు, సామాన్య ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాచార హక్కు చట్టం ద్వారా పారదర్శక పాలన అందేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఆర్టీఐ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సమాచారాన్ని పొందడంలో ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి, మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వరై వెంకటేశ్వర్లు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కాచం సత్యనారాయణ, దయాకర్ రావు, మారం గోనారెడ్డి, కోటగిరి దైవాధీనం, గందమళ్ల జయంత్, గాదె వినోద్ రెడ్డి, యర్రమాద హేమలత, బోగరి రామకృష్ణ, యాళ్ల చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం శ్రీనివాస్, కర్నాటి యాదగిరి, కార్యదర్శి తుంగతుర్తి రామకృష్ణ, గంటేకంపు గణేష్, బీమనపల్లి నగేష్, అదిమల్ల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణ స్వీకరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

చండూరు, నవంబర్ 14 (విజయ కెరటం):





మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయ్యప్ప దీక్ష స్వీకరించారు. చండూరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆయన మాలధారణ చేశారు. ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుచరులు కలిపి 100 మందికి పైగా అయ్యప్ప మాల ధరించి దీక్ష చేపట్టారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో చండూరులో నూతనంగా నిర్మించిన శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆలయాన్ని పరిశీలించి, జరగనున్న ఉత్సవాల ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతన ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన విగ్రహాల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

వృద్ధులకు అండగా మానవతా సేవ!

బాలల దినోత్సవం సందర్భంగా దుప్పట్లు, పండ్ల పంపిణీ

వరంగల్ నవంబర్ 14 విజయ కెరటం :



బాలల దినోత్సవం సందర్భంగా ప్రపంచ మానవ హక్కుల సామాజిక న్యాయ మండలి ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని గ్రామీణ సంక్షేమ వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది వృద్ధులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లతో పాటు చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని దుప్పట్లు పంపిణీ చేశారు.సంస్థ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షుడు, ప్రముఖ ఉన్నత న్యాయస్థాన న్యాయవాది డాక్టర్ కొప్పుల విజయకుమార్ ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర బాధ్యుడు ఎండీ సాదిక్ అలీ సూచనలతో జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ అమీర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ సాదిక్ అలీ మాట్లాడుతూ వృద్ధులు సమాజానికి మార్గదర్శకులని, వారిని గౌరవించడం, ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. మానవతా దృక్పథంతో అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడమే నిజమైన సమాజ సేవ అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బాధ్యుడు ఎండీ సాదిక్ అలీ, మహబూబ్‌నగర్ జిల్లా బాధ్యుడు ఎం. లక్ష్మీకాంత్, మహబూబ్‌నగర్ మండల అధ్యక్షుడు కె. రాఘవేంద్ర, జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ అమీర్, పట్టణ ఉపాధ్యక్షుడు సాదత్ అలీతో పాటు సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు..
రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని కాబోతున్నారు

కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రజలను మోసం చేశారు.. కేటీఆర్ మాట్లాడే ముందు ఆలోచించాలిలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 14 (విజయ కెరటం):



సోనియా గాంధీ చొరవతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఈ విషయం దేశంలోని ప్రతి ఒక్కరికీ తెలుసని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గతంలో కేసీఆర్ స్వయంగా అసెంబ్లీ సాక్షిగా సోనియా గాంధీని తెలంగాణ దేవతగా అభివర్ణించారని, తన కుటుంబ సభ్యులతో కలిసి ఆమె ఆశీస్సులు తీసుకున్నారని గుర్తుచేశారు. దేశం కోసం రాహుల్ గాంధీ కుటుంబం ప్రాణత్యాగాలు చేసిందని, దేశమే తన కుటుంబమని భావిస్తూ ప్రజల కోసం పనిచేస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు.హెచ్ఐసీసీ నోవాటెల్ వద్ద మీడియాతో మాట్లాడిన మంత్రి.. కేటీఆర్ మాట్లాడే ముందు ఆలోచించుకోవాలని సూచించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, అలా చేయకపోతే తన తలకాయ ఉండదని గతంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అడ్డగోలుగా హామీలు ఇచ్చి ప్రజలను, మైనార్టీలను, గిరిజనులను మోసం చేశారని విమర్శించారు. అందుకే ప్రజలు ఆ పార్టీని ఇంటికే పరిమితం చేశారని అన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. గిగ్ వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రత కోసం రాహుల్ గాంధీ చేతుల మీదుగా ప్రత్యేక పాలసీ తీసుకొచ్చి అమలు చేస్తున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ దేశానికి ప్రధానమంత్రి కాబోతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

మల్లన్న కారు ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలి

- **మల్లన్నకు జెడ్ ప్లస్ భద్రత కల్పించాలి.. మహిళ కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలి**

నల్లగొండ, నవంబర్ 14 (విజయ కెరటం):



తీన్మార్ మల్లన్న కారు ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు వైద్యం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రమాద ఘటనపై డీజీపీ స్థాయి అధికారితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.తీన్మార్ మల్లన్నకు తక్షణమే జెడ్ ప్లస్ భద్రత కల్పించాలని, ఆయన పాదయాత్ర పూర్తయ్యే వరకు పోలీసు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన మహిళ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రమాద ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

మంత్రి కొమటిరెడ్డి చొరవతో కాల్వల పూడికతీత పనులు ప్రారంభం

తిప్పర్తి నవంబర్ 14 విజయ కెరటం ప్రతినిధి:



మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చొరవతో పజ్జూరు పెద్దచెరువు, ఎర్రగడ్డలగూడెం గార్లచెరువులకు కృష్ణా జలాలు చేరేలా కాల్వల పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరువులు నీరు లేక ఎండిపోయి రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల సమస్యను పరిష్కరించేందుకు పజ్జూరు సర్పంచ్ మాతంగి హేమలత శోభన్ బాబు, ఎర్రగడ్డలగూడెం సర్పంచ్ యల్లంల సతీష్ రెడ్డి, వెంకటాద్రిపాలెం మాజీ సర్పంచ్ దొంతినేని సౌజన్య నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు మురళి రాగి తదితరులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వారి విజ్ఞప్తిపై మంత్రి వెంటనే స్పందించి కాల్వల్లో పేరుకుపోయిన పూడిక, కంపచెట్ల తొలగింపు కోసం 200 సామర్థ్యం కలిగిన హిటాచీ యంత్రాన్ని పంపించారు.ఈ నేపథ్యంలో శనివారం ఎర్రగడ్డలగూడెం సర్పంచ్ యల్లంల సతీష్ రెడ్డి D-40 కాల్వ నుంచి గార్లచెరువుకు నీరు చేరే 8R సబ్‌కెనాల్‌లో పూడికతీత పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సాగునీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి యంత్రాన్ని పంపించడం అభినందనీయమన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకుని చెరువులకు నీరు చేరేలా సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కాల్వల పూడికతీత పనులు పూర్తయితే కృష్ణా జలాలు చెరువులకు చేరి రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పగిడోజు భాస్కరాచారి, వార్డు సభ్యుడు బొబ్బలి సాయి, పజ్జూరు వార్డు సభ్యుడు మురళి రాగి, కందిమల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలసదనం, శిశుగృహంలో బాలల దినోత్సవ వేడుకలు





బాలలతో కేక్ కట్ చేయించి, ఆటపాటలతో సందడి చేసిన అధికారులు

నల్లగొండ, నవంబర్ 14 (విజయ కెరటం):

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లాలోని బాలసదనం, శిశుగృహంలో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు.ఈ సందర్భంగా అధికారులు బాలలతో కేక్ కట్ చేయించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. బాలసదనం, శిశుగృహంలో ఆశ్రయం పొందుతున్న బాలలకు మెరుగైన విద్య, ఆరోగ్యం, పోషకాహారం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి బాలిక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత విద్యను అభ్యసించి, జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. బాలల భవిష్యత్తుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తూ, వారిని సమాజంలో గౌరవంగా జీవించేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ సీహెచ్ కృష్ణ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి కె. గణేష్, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి. మహేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు, యువకే ఆర్గనైజేషన్ డైరెక్టర్ దారం మల్లేష్, బాలల పరిరక్షణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత!

- **బాలల వారోత్సవాలు ప్రారంభించిన కలెక్టర్ సత్య శారద**

వరంగల్, నవంబర్ 14 విజయ కెరటం :



బాలలందరికీ సమాన అవకాశాలు కల్పించి, వారి హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, పౌష్టికాహారం, రక్షణ కల్పించాలని సూచించారు.నవంబర్ 14 నుంచి 20 వరకు వారం రోజులపాటు నిర్వహించనున్న బాలల వారోత్సవాలను శనివారం నర్సంపేటలోని సంజీవని బాలల సంరక్షణ కేంద్రంలో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాక్టర్ మోహన్ రావు, వినోద దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంజీవని ఆశ్రమంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి రాజమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బాలలు ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా ప్రోత్సహించాలని, వారి భవిష్యత్తుతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని పేర్కొన్నారు. చిన్నారులకు సురక్షితమైన, సంతోషకరమైన బాల్యాన్ని అందించేందుకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, ఆర్డీవో ఉమారాణి సైతం బాలల అభివృద్ధి, విద్య, సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.అనంతరం కలెక్టర్ చిన్నారులతో సరదాగా గడిపారు. కోకో, కబడ్డీ, వ్యాసరచన, నిమ్మకాయల చెంచా పరుగు తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వైద్యాధికారులు డాక్టర్ కిరణ్, డాక్టర్ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి బత్తిని కళ్యాణి, బాలల సంక్షేమ సమితి సభ్యులు షాహిదా బేగం, మధు, తహసీల్దార్ దేవేందర్, శిశు అభివృద్ధి పథక అధికారులు మధురిమ, జ్యోతి, స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త శిరీష, బాలల సంరక్షణ విభాగం సిబ్బంది, సంజీవని ఆశ్రమం నిర్వాహకులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, బాలలు పాల్గొన్నారు.



ఎయిర్‌టెల్ టవర్లలో భారీ చోరీలు.. ఇంజినీర్ల ముఠా అరెస్ట్!

నల్గొండ, నవంబర్ 14 (విజయ కెరటం):

ఎయిర్‌టెల్ మొబైల్ టవర్లలోని ఖరీదైన రేడియో రిమోట్ యూనిట్లను (ఆర్ఆర్‌యూ) వరుసగా చోరీ చేస్తున్న ముఠా గుట్టును నల్గొండ సీసీఎస్ పోలీసులు రట్టు చేశారు. పనిచేస్తున్న సంస్థలోనే ఇంజినీర్లు, టెక్నీషియన్లు కలిసి దొంగతనాలకు పాల్పడటం ఈ కేసులో సంచలనం కలిగిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 38 చోరీలకు పాల్పడి, సుమారు రూ.1.62 కోట్ల విలువైన ఆర్ఆర్‌యూ యూనిట్లను అపహరించిన తొమ్మిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.25 లక్షల విలువైన మూడు కార్లు, రెండు బైకులు, రూ.15 లక్షల నగదు, ఎనిమిది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.జిల్లాలోని త్రిపురారం, నల్గొండ రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొబైల్ టవర్లకు సంబంధించిన ఆర్ఆర్‌యూ యూనిట్లు చోరీకి గురికావడంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేక దృష్టి సారించారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి పర్యవేక్షణలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో విచారణ జరిపిన పోలీసులు ఈ చోరీల వెనుక సంస్థలో పనిచేస్తున్న వారే ఉన్నట్లు గుర్తించారు.ఈ ముఠాలో ముగ్గురు ఇంజినీర్లు, నలుగురు రిగ్గర్లు, ఒక డ్రైవర్‌తో పాటు గతంలో అదే సంస్థలో పనిచేసిన మరో ఉద్యోగి ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తమకు ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ, రాత్రి వేళల్లో మొబైల్ టవర్ల వద్దకు వెళ్లి వైర్లు కత్తిరించి ఖరీదైన ఆర్ఆర్‌యూ యూనిట్లను అపహరించేవారు. అనంతరం వాటిని హైదరాబాద్‌లో విక్రయించి వచ్చిన డబ్బుతో విలాసవంతమైన కార్లు, బైకులు కొనుగోలు చేయడంతో పాటు జల్సాలకు ఖర్చు చేసేవారు.





వాహన తనిఖీల్లో పట్టుబడిన ముఠా

నవంబర్ 14న నల్గొండ రూరల్ పోలీసుల వాహన తనిఖీల సమయంలో గిగిరకలబావిగూడెం శివారులో ఐదుగురు అనుమానాస్పదంగా పట్టుబడ్డారు. విచారణలో వారు కాంచనపల్లి గ్రామంలో ఆర్ఆర్‌యూ చోరీకి వెళ్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు త్రిపురారం పోలీసుల తనిఖీల్లో బాబాసాయిపేట వద్ద నలుగురు పట్టుబడ్డారు. వారిలో పాత నేరస్థుడైన రమావత్ సుమన్‌ను గుర్తించి విచారించడంతో గతంలో చేసిన చోరీల వివరాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో రెండు ప్రత్యేక బృందాలు తొమ్మిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నాయి.

38 కేసుల్లో నిందితుల ప్రమేయం

పోలీసుల విచారణలో నల్గొండ జిల్లాలో 9, మిర్యాలగూడలో 16, దేవరకొండలో 2, సూర్యాపేటలో 8, ఇతర జిల్లాల్లో 3 చోరీ కేసుల్లో ఈ ముఠా ప్రమేయం ఉన్నట్లు తేలింది.

పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు

ఈ కేసును సమర్థవంతంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన త్రిపురారం ఎస్ఐ కె. నరేశ్, నల్గొండ రూరల్ ఎస్ఐ, సీసీఎస్ ఎస్ఐ సురేశ్, హెడ్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్ గిరి, పుష్పగిరి, ఫయాజ్, నాగరాజు, కానిస్టేబుళ్లు అస్రార్, సాయి, శివరాజు, నరేశ్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

నాలుగేళ్లుగా నిరుపయోగంగా రూ.3.5 కోట్ల విలువైన అండర్ బ్రిడ్జి బాక్సులు!

హైదరాబాద్ రోడ్డు రైల్వే అండర్ బ్రిడ్జిని డబుల్ వెంట్‌గా నిర్మించాలి

పనులు నిలిపివేసి అధికారులకు సమస్య వివరించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నల్గొండ, నవంబర్ 14 (విజయ కెరటం):



నల్గొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు రైల్వే అండర్ బ్రిడ్జిని డబుల్ వెంట్‌గా నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన రైల్వే ఇంజనీరింగ్ అధికారులను కలిసి సమస్యను వివరించారు.గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో హైదరాబాద్ రోడ్డును ఆరు వరుసల రహదారిగా అభివృద్ధి చేసే క్రమంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి సింగిల్ వెంట్ ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిపారు. ఈ మార్గంలో వాహనాల రద్దీ అధికంగా ఉంటుందని, సింగిల్ వెంట్ వల్ల ట్రాఫిక్ జామ్‌తో పాటు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులకు వివరించి పనులను నిలిపివేయించినట్లు వెల్లడించారు.అప్పట్లో రైల్వే ఉన్నతాధికారులు సమస్యను గుర్తించి డబుల్ వెంట్ నిర్మాణానికి అంగీకరించారని తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులు లేవని అధికారులు చెప్పడంతో, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సహకారంతో అప్పటి రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని సంప్రదించి రూ.3.5 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. ఆ నిధులతో డబుల్ వెంట్ నిర్మాణానికి అవసరమైన బాక్సులను కూడా తయారు చేశారని తెలిపారు.అయితే నాలుగేళ్లు గడిచినా ఆ బాక్సులను ఏర్పాటు చేయకుండా నిరుపయోగంగా ఉంచారని, దీంతో రహదారి ఇరుకుగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైల్వే లైన్ డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో మళ్లీ సింగిల్ వెంట్‌తోనే రహదారి నిర్మించే అవకాశం ఉందని తెలిసిందన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇప్పటికే తయారు చేసిన బాక్సులను ఏర్పాటు చేసి డబుల్ వెంట్ అండర్ బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజల రవాణా సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రైల్వే అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి, రేగట్టె మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528